

స్పేడెక్స్ డాకింగ్ సక్సెస్

- నింగిలో విజయవంతంగా ఉపగ్రహాల అనుసంధానం
- చరిత్ర సృష్టించిన ఇస్రో
- ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్
- రాష్ట్రపతి, ప్రధాని హర్షం

బెంగళూరు, జనవరి 16: వరుస ప్రయోగాలతో ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోసారి సత్తా చాటింది. నూతన ఏడాదిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పర్‌మెంట్ (స్పేడెక్స్) విజయవంతమైంది. నింగిలో రెండు ఉపగ్రహాల అనుసంధానం విజయవంతంగా పూర్తయింది. ఈ మేరకు ఇస్రో 'ఎక్స్'లో గురువారం వెల్లడించింది. 'అంతరిక్ష చరిత్రలో భారత్ తన పేరును లిఖించుకున్నది. గుడ్‌మార్నింగ్ ఇండియా! ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ మిషన్ డాకింగ్ విజయవంతమైంది. ఈ అద్భుతమైన క్షణాలకు సాక్ష్యంగా నిలిచినందుకు గర్వంగా ఉంది' అని ఇస్రో తెలిపింది. పోస్ట్ డాకింగ్, రెండు ఉపగ్రహాలను ఒకే వస్తువుగా నియంత్రించడం కూడా విజయవంతమైందని ఇస్రో వెల్లడించింది. అన్‌డాకింగ్, పవర్ ట్రాన్స్‌ఫర్ చెక్ చేయడం లాంటి కార్యక్రమాలను రానున్న రోజుల్లో చేపట్టనున్నట్టు ఇస్రో వెల్లడించింది.

అగ్రరాజ్యాల సరసన

స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. ఉపగ్రహాల డాకింగ్ సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా మన దేశం అవతరించింది. నింగిలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసిన భారత్.. అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన సగర్వంగా చేరింది.

పలుమార్లు వాయిదా పడ్డా..

గతేడాది డిసెంబర్ 30న స్పేడెక్స్ మిషన్‌ను ఇస్రో చేపట్టిన విషయం విదితమే. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ ద్వారా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే రెండు ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువుండే ఆ శాటిలైట్లతో పాటు 24 పేలోడ్‌లను కూడా పీఎస్ఎల్వీ తీసుకెళ్లింది. నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ రాకెట్ 15 నిమిషాల తర్వాత వాటిని 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జనవరి 7, 9, 11 తేదీల్లో డాకింగ్ ప్రక్రియ చేపట్టాలని ఇస్రో అనుకున్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించిన తర్వాత గురువారం రెండు ఉపగ్రహాల అనుసంధానాన్ని ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది.

రాష్ట్రపతి ముర్ము అభినందనలు

అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేయడం ద్వారా భారత్ అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్రాత్మక మైలురాయికి చేరుకుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఇస్రోను, శాస్త్రవేత్తలను ఆమె అభినందించారు. 'భారత్ చేపట్టబోయే చంద్రయాన్-4, స్వదేశీ స్పేస్ స్టేషన్, గగన్‌యాన్ లాంటి ప్రయోగాలకు ఇది మార్గం సుగమం చేసింది' అని రాష్ట్రపతి ముర్ము తెలిపారు.

ప్రధాని మోదీ హర్షం

స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందిని ఆయన అభినందించారు. 'రెండు ఉపగ్రహాలను విజయవంతంగా డాకింగ్ చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు. రానున్న సంవత్సరాల్లో భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాలకు ఇది కీలకమెట్టు' అని మోదీ తెలిపారు.

సైఫ్ అలీఖాన్‌పై దాడి

- ముంబైలోని ఇంట్లోకి చొరబడి కత్తితో పొడిచిన దుండగుడు
- లీలావతి దవాఖానకు తరలింపు
- శస్త్రచికిత్స చేసి వెన్నెముక నుంచి కత్తిముక్క తొలగించిన వైద్యులు
- ప్రాణాపాయమేమీ లేదని వెల్లడి
- కోటి డిమాండ్ చేసిన దుండగుడు!
- ఘటనపై సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి
- సెలబ్రిటీలకే రక్షణ లేదన్న విపక్షాలు

అనుమానిత నిందితుడు

ముంబై, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కత్తిపోట్లకు గురయ్యారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ముంబైలోని బాంద్రాలో ఆయన నివసిస్తున్న సద్గురు శరణ్ భవనం 12వ అంతస్తులోని ఫ్లాట్‌లోకి ప్రవేశించిన ఒక దుండగుడు కత్తితో పలుసార్లు పొడవడంతో సైఫ్ అలీ ఖాన్ గాయపడ్డారు. తీవ్రంగా రక్తస్రావం అయిన ఆయనను ఆటోలో లీలావతి హాస్పిటల్‌కు తరలించగా, అత్యవసర శస్త్రచికిత్స చేశారు. 54 ఏండ్ల సైఫ్‌కు ప్రాణాపాయం తప్పిందని లీలావతి హాస్పిటల్ సీఓఓ నీరజ్ ఉత్తమా తెలిపారు. సైఫ్ అలీఖాన్‌కు మొత్తం ఆరు గాయాలయ్యాయని, అందులో రెండు చిన్నవి, రెండు మధ్యస్థమైనవని చెప్పారు. ఒక గాయం వెన్నెముకకు దగ్గరలో ఏర్పడిందన్నారు. వెన్నెముక దగ్గర ఇరుక్కుపోయిన 2.5 అంగుళాల కత్తిముక్కను తొలగించామని తెలిపారు.

దాడి ఎలా జరిగిందంటే...

ఘటన జరిగిన సమయంలో భవనంలో సైఫ్ అలీ ఖాన్, అతని భార్య, నటి కరీనా కపూర్, వారి ఇద్దరి కుమారులు జెహ్ (4), తైమూర్ (8), ఐదుగురు పనివారు ఉన్నారు. జెహ్, తైమూర్ గదిలో ఉన్న జెహ్ కేర్‌టేకర్, నర్సు అయిన ఎలియమా ఫిలిప్ తొలుత దుండగుడిని గుర్తించి అడ్డుకుంది. నిందితుడి చేతిలో కర్రతోపాటు హాక్సా బ్లేడ్ ఉందని, వాటితో తనను గాయపరిచాడని, అరవద్దని హెచ్చరించాడని వెల్లడించింది. తనకు కోటి రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడని తెలిపింది. ఈ గొడవకు సైఫ్, కరీనాలు లేచి అక్కడికి రాగా, సైఫ్‌పై ఆ వ్యక్తి దాడి చేశాడని చెప్పింది. ఇంతలో పనివారొకరు రావడంతో దుండగుడు పారిపోయాడని పేర్కొంది. సైఫ్ గాయపడిన విషయాన్ని 8వ అంతస్తులో నివసిస్తున్న అతని మొదటి భార్య పెద్ద కుమారుడు ఇబ్రహీం అలీఖాన్, కుమార్తె సారా అలీఖాన్‌కు పనివారు తెలపడంతో వారు తండ్రిని కిందకు తీసుకువచ్చారు.డ్రైవర్ అందుబాటులో లేకపోవడం, వారి ఎలక్ట్రిక్ వాహనం ఎలా ఆపరేట్ చేయాలో తెలియక ఆటోలో లీలావతి దవాఖానకు తరలించారు.

ఇంట్లో వారి సహకారంతోనే..

దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సైఫ్ ఇంట్లో దోపిడీ కోసం ఫైర్ ఎగ్జిట్ మెట్ల మార్గం ద్వారా లోపలికి వచ్చాడని, అంతకుముందు అతను కొన్ని గంటల పాటు అక్కడే నక్కి ఉన్నాడని ముంబై పోలీస్ డీసీపీ గెడం దీక్షిత్ తెలిపారు. సైఫ్ ఇంటి నుంచి ముగ్గురు వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో దాడిలో గాయపడిన ఇంటి పనిమనిషి కూడా ఉంది. ఇంట్లో ఉన్న వారిలో ఎవరో ఒకరు దుండగుడిని లోపలికి అనుమతించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. విచారణ నిమిత్తం క్రైం బ్రాంచ్ రాగా,ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ దయానాయక్ కూడా ఈ బృందంలో ఉన్నారు.

సెలబ్రిటీలకే రక్షణ లేదు

వాణిజ్య రాజధాని ముంబైలో సెలబ్రిటీలకు సైతం రక్షణ కరవైందని మహారాష్ట్ర విపక్ష నేతలు విమర్శించారు. రాష్ట్రంలో దిగజారుతున్న శాంతిభద్రతలకు ఈ ఘటన నిదర్శనమని ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ముంబైలో సెలబ్రిటీల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శించారు. కాగా, ముంబైను సురక్షిత నగరంగా ఉంచడానికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు.

చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ దిగ్భ్రాంతి

సైఫ్ అలీఖాన్‌పై దుండగుడు దాడి చేసిన ఘటన తీవ్రంగా కలచివేసిందని, ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. ఇటీవల దేవర చిత్రంలో తనతో నటించిన సైఫ్ అలీఖాన్‌పై హత్యాయత్నం జరగడంపై జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహానగరంలో ఈ దారుణమేంటని నటి పూజాభట్ నిలదీశారు. సైఫ్ సోదరి సబా పటౌడి, నటి పరిణీతీ చోప్రా, స్వరభాస్కర్, నటులు సోనూసూద్ సైఫ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ వినోద్ చంద్రన్ ప్రమాణం

న్యూఢిల్లీ, జనవరి 16: సుప్రీంకోర్టు జడ్జిగా పట్నా హైకోర్టు సీజే జస్టిస్ కే వినోద్ చంద్రన్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. జస్టిస్ చంద్రన్ నియామకంతో సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 33కు చేరింది. దేశ అత్యున్నత న్యాయస్థానంలో మొత్తం మంజూరైన పోస్టుల సంఖ్య 34. ఈ నెల 13న కేంద్రం జస్టిస్ చంద్రన్ నియామకానికి ఆమోదం తెలిపింది.

సునీత విలియమ్స్ స్పేస్‌వాక్

7 నెలల తర్వాత ఐఎస్ఎస్ నుంచి మొదటిసారి బయటకు

కేప్ కెనవెరాల్, జనవరి 16: భారత సంతతి అమెరికన్ వ్యోమగామి సునీత విలియమ్స్.. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి మొదటిసారి బయటకు అడుగుపెట్టారు. ఐఎస్ఎస్‌కు కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆమె, మరో వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి గురువారం స్పేస్‌వాక్ చేశారని నాసా తెలిపింది. ఐఎస్ఎస్‌కు వెళ్లిన తర్వాత ఇద్దరు వ్యోమగాములకు ఇది మొదటి స్పేస్‌వాక్ కాగా, సునీత విలియమ్స్‌కు ఇది 8వ సారిగా నాసా పేర్కొన్నది. కేవలం వారం రోజుల అంతరిక్ష యాత్ర నిమిత్తం సునీత విలియమ్స్, విల్మోర్‌లను గత ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు పంపారు. తిరుగు ప్రయాణంలో బోయింగ్ 'స్టార్‌లైనర్'కు సాంకేతిక లోపం తలెత్తటంతో.. వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. దాదాపు 10 నెలల తర్వాత ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో వారిని భూమి మీదకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎనిమిదో వేతన సంఘానికి పచ్చ జెండా

- ఉద్యోగులకు కేంద్రప్రభుత్వం శుభవార్త
- శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి ఆమోదముద్ర
- క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, జనవరి 16: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల జీతభత్యాలను సవరించడానికి ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ సంఘానికి చైర్మన్, ఇద్దరు సభ్యులను త్వరలోనే నియమిస్తామని ఆయన తెలిపారు. ఏడో వేతన సంఘం గడువు 2026లో ముగియనుంది. ఈలోపే ఎనిమిదో వేతన సంఘం సిఫారసులు వచ్చేలా ఏడాది ముందే ఎనిమిదో వేతన సంఘాన్ని నియమించినట్టు ఆయన చెప్పారు.

రూ.3,985 కోట్లతో మూడో ప్రయోగ వేదిక...

ఇస్రోకు చెందిన శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో మూడో ప్రయోగ వేదిక నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ పచ్చ జెండా ఊపింది. ఈ లాంచ్ ప్యాడ్‌ను రూ.3,985 కోట్లతో నిర్మించనున్నట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. తర్వాతి తరం వ్యోమనౌకల ప్రయోగానికి, రెండో ప్రయోగ వేదికకు తోడ్పాటుగా ఉండటానికి మూడో ప్రయోగ వేదికను నిర్మిస్తున్నారు. నాలుగేండ్లలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.

రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా

ఇండోనేషియా అధ్యక్షుడు

న్యూఢిల్లీ: భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరుకాబోతున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సుబియాంతో జనవరి 25 నుంచి 26 వరకు భారత్‌లో పర్యటిస్తారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత్‌కు వస్తున్నారని, అలాగే గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారని విదేశాంగ శాఖ తెలిపింది.

సంపన్నుల గుప్పిట్లోకి అమెరికా: బైడెన్

వాషింగ్టన్: సంపద, అధికారం, పలుకుబడిగల కొంతమందితో కూడిన కూటమి రూపుదిద్దుకుంటున్నదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పారు. ఈ కూటమి వల్ల అమెరికా ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలకు నిజమైన ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. అమెరికన్లపై మితిమీరిన సంపన్న టెక్-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ ఎదురులేని అధికారాన్ని చెలాయించవచ్చునన్నారు. ఆయన పదవీ కాలం ముగుస్తుండటంతో బుధవారం వీడ్కోలు సభలో మాట్లాడుతూ ఈ హెచ్చరిక చేశారు. తన పదవీ కాలంలో ఉద్యోగాలను సృష్టించానని, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేశానని, ఆరోగ్య సంరక్షణ, కొవిడ్-19 మహమ్మారి నుంచి దేశాన్ని బయటకు తీసుకొచ్చానని తెలిపారు. అమెరికాను సురక్షిత దేశంగా తీర్చిదిద్దానన్నారు. ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

12 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎదురుకాల్పులు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- అడవిని చుట్టుముట్టిన 1,500 మంది జవాన్లు

కొత్తగూడెం ప్రగతి మైదానం, జనవరి 16: మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భీకర యుద్ధంతో దండకారణ్యం దద్దరిల్లింది. ఇరువర్గాల మధ్య జరిగిన పోరులో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా పూజారీ కాంకేర్ అడవుల్లో పెద్ద ఎత్తున మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల డీఆర్జీ జవాన్లతోపాటు కోబ్రా, సీఆర్పీఎఫ్‌కు చెందిన సుమారు 1,500 మంది బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు భారీ ప్లీనరీకి రంగం సిద్ధం చేస్తున్నట్లు ముందుగానే సమాచారం తెలుసుకున్న పోలీస్ అధికారులు దానిని అడ్డుకునేందుకు పావులు కదిపారు. ఇందులో భాగంగానే మూడు జిల్లాలకు చెందిన భద్రతా దళాలు వ్యూహాత్మకంగా వ్యవహరించి మార్పుర్-పూజారీ కాంకేర్ అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువర్గాల మధ్య సుమారు రెండున్నర గంటలపాటు భీకర పోరు జరిగినట్లు తెలుస్తున్నది. నలువైపులా చుట్టుముట్టిన జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టారు. కాల్పుల్లో సుమారు 12 మంది మావోయిస్టులు మృతిచెందినట్లుగా తెలుస్తున్నది. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలం నుంచి ఎస్ఎల్ఆర్ రైఫిల్, 12 బోర్ తుపాకీ, రెండు సింగిల్ షాట్ తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్, నాటు తుపాకీతోపాటు మందుగుండు, ఇతర వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు. ఎన్‌కౌంటర్ ఘటనతో ఒక్కసారిగా ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ వాసులు ఉలిక్కిపడ్డారు. ఇప్పటికే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భద్రతా దళాలు అప్రమత్తమై అడవులను జల్లెడ పడుతున్నాయి.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలైన ఘటన బీజాపూర్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో కోబ్రా బెటాలియన్ జవాన్లు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. జవాన్లు చప్టా మీదకు రాగానే దాని కింద మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.మరోవైపు మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్ కేర్లపాల్(దర్భా డివిజన్ కమిటీ)కి చెందిన ఏరియా కమిటీ సభ్యురాలు కలుము పాయి పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తి చెంది పోలీసుల ఎదుట లొంగిపోయారు.

ప్రచారంలో ఏఐ వాడకంపై

ఈసీ అడ్వైజరీ

న్యూఢిల్లీ:ఏఐ , డీప్ ఫేక్ టెక్నాలజీలతో జరుగుతున్న ఎన్నికల ప్రచారంపై ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన ఎన్నికల కమిషన్(ఈసీ), ఈ అంశంపై తాజాగా ఆయా రాజకీయ పార్టీలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఏఐ టెక్నాలజీతో తయారుచేసిన కంటెంట్‌ను వాడటంలో ఆయా రాజకీయ పార్టీలు జవాబుదారీతనం, పారదర్శకత పాటించాలని ఈసీ పేర్కొన్నది. ఏఐతో రూపొందించిన వీడియో, ఆడియో, ఫొటోలపై 'ఏఐ జెనరేటెడ్ లేదా డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్ లేదా సింథటిక్ కంటెంట్' అన్న లేబుల్‌ను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా వాడాలని ఈసీ స్పష్టంచేసింది. ఫిబ్రవరి 5న జరుగుతున్న ఢిల్లీ ఎన్నికల్లో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ పెద్ద ఎత్తున డిజిటల్ ప్రచారాన్ని చేపట్టాయి. ఏఐ టెక్నాలజీతో రూపొందిన కంటెంట్‌తో పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి.

ఓఎంఆర్ పద్ధతిలో నీట్ యూజీ

- ఒకే రోజు, ఒకే షిఫ్ట్‌లో పరీక్ష
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గే అవకాశం



న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్‌గ్రాడ్యుయేట్ (నీట్ యూజీ)-2025ను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం ప్రకటించింది. ఈ పరీక్ష ఒకే రోజు, ఒకే షిఫ్ట్‌లో జరుగుతుందని తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. కేంద్ర విద్య, ఆరోగ్య శాఖల సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఆఫ్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపింది. బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సుల కోసం కూడా నీట్ (యూజీ)ని రాయాలని పేర్కొన్నది. నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి పరిధిలోని బీహెచ్ఎంఎస్ కోర్సు కోసం కూడా ఈ పరీక్షను రాయాలని చెప్పింది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీస్ హాస్పిటల్స్ నిర్వహించే బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో చేరడం కోసం కూడా నీట్ (యూజీ), 2025ని రాయాలని వివరించింది. కంప్యూటర్ బేస్డ్ విధానం కన్నా పెన్, పేపర్ మోడ్ వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. అందువల్ల ఈ నిర్ణయాన్ని చాలా మంది విద్యార్థులు స్వాగతించే అవకాశం ఉంది. అభ్యర్థుల హాజరునుబట్టి చూసినపుడు మన దేశంలో అతి పెద్ద ప్రవేశ పరీక్ష నీట్. గత ఏడాది ఈ పరీక్షకు 24 లక్షల మందికిపైగా హాజరయ్యారు.

వందేండ్లుగా ప్రతి కుంభమేళాకు..

మహా కుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళాలో 129 ఏళ్ల స్వామి శివానంద బాబా పాల్గొన్నారు. ఆయన గత వందేళ్ల నుంచి ప్రయాగ్‌రాజ్, నాసిక్, ఉజ్జయిని, హరిద్వార్‌లలో జరిగిన అన్ని కుంభ మేళాలకు హాజరయ్యారని ఆయన శిష్యులు తెలిపారు. ఆయన క్రమం తప్పకుండా యోగా చేస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయనను 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. స్వామి శివానంద నిత్యం తెల్లవారుజామున 3 గంటలకు నిద్ర నుంచి లేచి, యోగా చేస్తారు. రాత్రి 9 గంటలకు నిద్రకు ఉపక్రమిస్తారు. ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. రోజూ కనీసం ఓ అరగంట సమయాన్ని యోగాకు కేటాయించాలని ఆయన యువతకు సలహా ఇచ్చారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ!

న్యూఢిల్లీ: ఏపీ ప్రజలకు కేంద్రం శుభవార్త అందజేసింది. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్)కు ఆర్థికంగా భారీ సాయం అందించాలని నిర్ణయించింది. గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ ప్యాకేజీ ద్వారా స్టీల్ ప్లాంట్‌ను నడిపేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన విధివిధానాలను కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి శుక్రవారం వెల్లడించే అవకాశాలున్నాయి.

కేరళ నర్స్‌కు 70 కోట్ల జాక్‌పాట్

న్యూఢిల్లీ: యూఏఈలో కేరళ నర్స్ మను మోహనన్‌కు జాక్‌పాట్ తగిలింది. లాటరీలో ఆయన రూ.70 కోట్లు గెలుచుకున్నారు. లైవ్ టీవీ షోలో జరిగిన బిగ్ టికెట్ రాఫెల్ డ్రాలో హోస్ట్ ఆయనను పిలిచి, ''మీరు 3 కోట్ల దిర్హామ్స్ విజేత'' అని చెప్పారు. మోహనన్ షాక్‌కి గురై, నిజమేనా? అని మూడుసార్లు టికెట్ నంబరును చెప్పించుకున్నారు. 'రెండు టికెట్లు కొంటే ఒకటి ఉచితం' స్కీమ్‌లో ఆయన ఈ టికెట్‌ను గత నెలలో కొన్నారు. మోహనన్ మాట్లాడుతూ, తాను, తన స్నేహితులు ఐదేళ్ల నుంచి లాటరీలో బహుమతి కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తాను ఏడేళ్ల నుంచి బహ్రెయిన్‌లో నర్స్‌గా పని చేస్తున్నానని తెలిపారు.

రికార్డుల్లో ఉంటారు..

కాలేజీల్లో కనిపించరు!

- కెనడాలో భారత విద్యార్థులపై ఐఆర్‌సీసీ నివేదిక
- 20 వేల మంది అడ్మిషన్లు పొందలేదని వెల్లడి

టొరంటో: విద్యాభ్యాసం కోసం భారత్ నుంచి తమ దేశానికి వచ్చిన వారిలో 20 వేల మంది ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందలేదని కెనడా వలస, కాందిశీకుల, పౌరసత్వ సంస్థ(ఐఆర్‌సీసీ) వెల్లడించింది. బుధవారం గ్లోబల్ అండ్ మెయిల్‌లో ఇందుకు సంబంధించిన నివేదిక ప్రచురితమైంది. మొత్తం 49,476 మంది విద్యార్థుల్లో 6.9 శాతం మంది తాము ఐఆర్‌సీసీలో నమోదు చేసుకున్న విద్యా సంస్థల్లో ప్రవేశం పొందలేదని నివేదిక తెలిపింది. మొత్తం 3.27 లక్షల మంది విద్యార్థుల్లో 19,582 మంది(5.4 శాతం) విద్యార్థులు సంబంధిత కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి తమ సమ్మతి తెలపలేదని వెల్లడించింది. మరో 12,553 మంది ప్రవేశాల సమాచారం విద్యాసంస్థల వద్ద లేదని చెప్పింది. విద్యార్థులతో పాటు ఇతరుల తాత్కాలిక నివాసితుల వీసాలు పెరగడాన్ని కూడా ఐఆర్‌సీసీ తన నివేదికలో పేర్కొంది. అయితే నివేదిక పేర్కొన్న దాని కంటే ఎక్కువ మంది భారత విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాలు పొంది ఉండరని వలసల విశ్లేషకుడు దర్శన్ మహరాజా తెలిపారు. అయితే కెనడాకు వచ్చాక తాము చేరదలచుకున్న విద్యాసంస్థ పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్‌కు అర్హత కలిగి లేదని తెలుసుకున్నాక.. విద్యార్థులు వేరొక కాలేజీని ఎంపిక చేసుకుంటున్నారని.. ఈ సమాచారాన్ని ఐఆర్‌సీసీలో అప్‌డేట్ చేయకపోవడం వల్ల కళాశాలల్లో నమోదు కాని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నదని దీక్షిత్ సోనీ అనే కన్సల్టెంట్ విశ్లేషించారు.



ప్రమాదంలో చందమామ!

వారసత్వ స్థలాల జాబితాలో చేర్చిన డబ్ల్యూఎంఎఫ్

న్యూఢిల్లీ: ప్రమాదంలో ఉన్న వారసత్వ స్థలాల జాబితాలో చందమామను వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్ (డబ్ల్యూఎంఎఫ్) చేర్చింది. భవిష్యత్తులో వాణిజ్యపరమైన అంతరిక్ష కార్యక్రమాలు చందమామను దోపిడీ చేసి, నష్టపరిచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సాధారణంగా ఈ ఫండ్ భూమిపైగల సాంస్కృతిక ప్రాధాన్యం గల స్థలాలపైనే దృష్టి పెడుతుంది. కానీ చందమామకు పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో తొలిసారి ఈ జాబితాలో చేర్చింది. డబ్ల్యూఎంఎఫ్ సీఈఓ బెనెడిక్ట్ డీ మాంట్లార్ మాట్లాడుతూ, చందమామపై కార్యకలాపాలు వేగవంతమవుతున్నాయని, సరైన రక్షణ చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. మన చరిత్రలో ఇది నిర్వచనీయ సమయమని,భూమికి వెలుపల మానవుల తొలి కార్యక్రమాలను తెలియజేసే నిర్మాణాలను కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు.

గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- 72 మంది మృతి చెందారన్న గాజా ఆరోగ్య శాఖ
- కాల్పుల విరమణ తర్వాతా కొనసాగిన దాడులు



దాడిలో ధ్వంసమైన ఉత్తర గాజాలోని భవనాలు

టెల్ అవీవ్: ఒక పక్క హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం జరిగినా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 72 మంది పౌరులు మృతి చెందినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. ఇది గాజాలోని రెండు దవాఖానలకు తీసుకువచ్చిన మృత దేహాల సంఖ్య అని, వాస్తవానికి మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుందని ఆ శాఖ తెలిపింది. 'నిన్న రక్తసిక్తమైన రోజు.. ఈ రోజు మరింత రక్తసిక్తమైన రోజు' అని రిజిస్ట్రేషన్ శాఖ చీఫ్ జహేర్ అల్ వాహెదీ పేర్కొన్నారు. కాగా, కాల్పుల విరమణకు కొన్ని గంటల ముందు ఇరు వర్గాలు తమ సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తయినట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మధ్యవర్తిగా వ్యవహరించిన ఖతార్ వెల్లడించిన తర్వాత దీనిపై కొన్ని సమస్యలున్నట్టు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించారు. గాజా స్ట్రిప్‌లో హమాస్ బందీలుగా ఉన్న డజన్ల మంది పౌరుల విడుదల, గాజాతో యుద్ధం నిలుపుదలకు ఉద్దేశించిన చిరకాల కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ఆమోదాన్ని ఆఖరి నిమిషం సంక్షోభం అడ్డుకుందని ఆయన పేర్కొన్నారు.

విడిపోతున్న ఒబామా దంపతులు!

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన సతీమణి మిషెల్ ఒబామా విడాకులు తీసుకుంటున్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పలు అధికారిక కార్యక్రమాలకు బరాక్ ఒబామా ఒక్కరే హాజరుకావటం, ట్రంప్ ప్రమాణ స్వీకారానికి కూడా రావటం లేదని మిషెల్ ప్రకటించటం ఈ వార్తలకు బలాన్ని చేకూర్చింది. ఈ అంశంపై 'న్యూయార్క్ పోస్ట్' కూడా ఓ వార్తా కథనం వెలువరించింది. మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియలకు బరాక్ ఒబామా ఒక్కరే హాజరైన సంగతిని ఓ నెటిజన్ గుర్తుచేశాడు.